సిద్ధేశ్వరం డబుల్ రోడ్డు అదుర్స్

- రూ.4.50 కోట్ల నిధులతో నిర్మాణం
- వాహనచోదకులు, స్థానికుల హర్షం



కొత్తగా నిర్మిస్తున్న ఫుట్‌పాత్

పెదగంట్యాడ: సిద్ధేశ్వరం డబుల్ రోడ్డు అదుర్స్ అనిపిస్తోంది. కొత్తగా నిర్మించిన ఈ రహదారి మెరిసిపోతోంది. నిన్న మొన్నటి వరకూ అధ్వానంగా ఉన్న ఈ రహదారి ఇప్పుడు తళతళలాడుతోంది. జీవీఎంసీ 74వ వార్డుతో పాటు 75వ వార్డు మధ్యలో ఉన్న ఈ రోడ్డులో ప్రయాణం ఇప్పుడు సాఫీగా సాగిపోతోంది. గతంలో ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోకపోవడంతో గతుకులమయంగా మారింది. వర్షం పడితే చాలు నీరు నిల్వ ఉండిపోయేది. దీంతో స్థానికులు, వాహనచోదకులు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ఇక్కడి పరిస్థితిపై 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి స్పందించారు. పరిస్థితిని స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

రూ.4.40 కోట్లతో..

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి స్పందించి ఈ రోడ్డుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. అయితే ఆ రోడ్డుకు సంబంధించి పూర్తి స్థాయిలో నిధులు సమకూర్చలేమని అధికారులు చేతులెత్తేయడంతో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఎంపీ ఎంవీవీ స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.1.94 కోట్లను మంజూరు చేశారు. ఆపై జీవీఎంసీ అధికారులు రూ.1.94 కోట్లను మంజూరు చేయడంతో పాటు వెంటనే శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. అలాగే టెండర్లు పిలిచి చకచకా రోడ్డు నిర్మాణం చేపట్టారు.

రూ.50లక్షలతో విద్యుత్ స్తంభాలు, దీపాలు

సిద్ధేశ్వరం రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై ఉన్న పాత స్తంభాలను జీవీఎంసీ అధికారులు తొలగించారు. అక్కడ రూ.50 లక్షలతో కొత్తగా అండర్ గ్రౌండ్‌లో వైర్లు వేయడంతో పాటు కొత్తగా స్తంభాలు, విద్యుత్ దీపాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. 11 కేవీ లైన్ షిఫ్టింగ్, ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్ పనులు చేపట్టారు. దీంతో ఈ రోడ్డులో విద్యుత్ దీపాలు వెలుగులు విరజిమ్ముతున్నాయ్.



సిద్ధేశ్వరం డబుల్ రోడ్డు

రూ.12లక్షలతో వాటర్ పైప్‌లైన్ షిఫ్టింగ్

ఈ రోడ్డులో ఉన్న పైప్‌లైన్ కోసం అధికారులు రూ.15లక్షలు ఖర్చు చేశారు. రోడ్డు పక్కనున్న ఈ లైన్లను తొలగించి మళ్లీ కొత్తగా ఏర్పాటు చేశారు.

40 ఏళ్ల కల.. నెరవేరిన వేళ.. : ఎప్పుడో 40 ఏళ్ల క్రితం ఈ రోడ్డు వేశారు. తర్వాత కాలంలో ఎవరూ దీనిని పట్టించుకున్న పాపాన పోలేదు.. అప్పటి నుంచి ఈ రోడ్డు అలాగే ఉంది. అధ్వానంగా తయారైంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. అయితే ఇప్పుడు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి చొరవతో.. ఎమ్మెల్యే నాగిరెడ్డి సహకారంతో ఈ రహదారి నిర్మించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



నాడు: గోతులమయమైన సిద్ధేశ్వరం డబుల్ రోడ్డు



నేడు: కొత్తగా నిర్మించిన సిద్ధేశ్వరం డబుల్ రోడ్డు

ఇబ్బందులు తొలగిపోయాయి



ఎప్పుడో ఏళ్ల క్రితం నాటి రోడ్డును చూసి చలించి పోయాను.. ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకునేవి. ఎంతోమంది గాయపడ్డారు. ఈ రహదారిలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించేవారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే రోడ్డు నిర్మించాం. ఇప్పుడు అంతా సవ్యంగా ఉంది.. రాకపోకలకు ఇబ్బందులు లేవు.

–తిప్పల వంశీరెడ్డి, కార్పొరేటర్, 74వ వార్డు

రోడ్డు బాగుంది



40 ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నాను. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేసేవాడిని.. విధుల నుంచి రాత్రి వేళల్లో ఇంటికి రావడానికి ఇబ్బందులు పడేవాడిని. ఒక్కోసారి గోతుల్లో పడడంతో గాయాలయ్యేవి. ఎన్నో ఏళ్ల నుంచి అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును ఇప్పుడు కొత్తగా నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బంది లేదు. ఈ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డికి కృతజ్ఞతలు.

–గొందేశి సత్యారావు, దల్లివానిపాలెం

ప్రమాదాలు తగ్గుముఖం



సిద్ధేశ్వరం, కోరాడ, దల్లివానిపాలెం, రెడ్డి ముసలినాయుడు పాలెం, సీతానగరం తదితర ప్రాంతాలకు చెందిన వారందరికీ ఇదే ప్రధాన రహదారి. ఇక్కడి నుంచి గాజువాక వెళ్లాలన్నా, గంట్యాడ వెళ్లాలన్నా ఈ రోడ్డు గుండా వెళ్లాల్సిందే. అయితే ఈ రోడ్డు గతుకులమయం కావడంతో గతంలో ఇక్కడ ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. ఇప్పుడు ఈ రహదారిని విశాలంగా నిర్మించడంతో పాటు పాదచారులు నడిచేందుకు ఫుట్‌పాత్‌లు నిర్మించడం సంతోషంగా ఉంది. –నందికి తాతారావు, సిద్ధేశ్వరం

విశాలమైన రహదారి



నేను చిన్నప్పటి నుంచి చూస్తున్నాను.. ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. పిల్లలను ఇటువైపు పంపించాలంటే భయపడాల్సి వచ్చేది. పాఠశాలకు దగ్గరుండి తీసుకెళ్లాల్సి వచ్చేది. ఇక్కడ ఇప్పుడు నిర్మించిన రోడ్డుతో నిశ్చింతగా ఉంది. ఇంత విశాలమైన రోడ్డు నిర్మించడంతో ప్రమాదాలు తగ్గాయి.

–పులి పద్మ, రెడ్డిముసలినాయుడుపాలెం.

క్లుప్తంగా

కేజీహెచ్‌కు వెళ్లి.. పింఛను అందజేసి..



త్రినాథరావుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ వరలక్ష్మి

అగనంపూడి: వలంటీర్లు సేవాభావం చాటుకుంటున్నారు. 85వ వార్డు బీసీ కాలనీకి చెందిన ఎస్.త్రినాథరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆ వార్డు సచివాలయ వలంటీర్ వరలక్ష్మి కేజీహెచ్‌కు వెళ్లి బాధితుడికి పింఛన్ అందించారు. అలాగే అదే వార్డుకు చెందిన కొండయ్యవలస లక్ష్మి కూడా కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండడంతో ఆ వార్డు వలంటీర్ అక్కడకు వెళ్లి పింఛన్‌ను అందించారు.

పేద కుటుంబాలకు సాయం



నిత్యావసర సరుకులు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

అగనంపూడి: అగనంపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 2000–01 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు ఉచితంగా అందించారు. అలాగే క్యాన్సర్‌తో బాధపడుతున్న బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించింది.

పెదగంట్యాడ తహసీల్దార్‌గా భాస్కరరావు



పెదగంట్యాడ: పెదగంట్యాడ తహసీల్దార్‌గా ఐ.భాస్కరరావు నియమితులయ్యారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయనను ఇక్కడకు నియమించారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న రమాదేవిని విజయనగరం జిల్లా గుర్ల మండలానికి బదిలీ చేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ హేమలత

పెదగంట్యాడ: ఉరుకులు పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ అనారోగ్య సమస్యలతో సతమతమౌతున్నారని పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి హేమలత అన్నారు. విద్యా ప్రగామి ట్రస్ట్ సహకారంతో హోలీ ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో హెల్త్ అండ్ ఎన్విరాన్మెంటల్ కేర్ పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమన్నారు. మంచి ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎం. నానాజీ, రవికుమార్, సురేఖ, ప్రేమ్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌కు సత్కారం



జొన్నకూటి విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నేతలు

అగనంపూడి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన వైఎస్సార్‌సీపీ నాయకులు, సామాజిక కార్యకర్త జొన్నకూటి విజయ్‌కుమార్‌ను ప్రజా సంఘాల నేతలు సత్కరించారు. నిర్వాసితకాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో కొప్పుల రమేష్, బి.ఎం.రావు మాట్లాడుతూ విజయ్‌కుమార్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్ష పదవిని అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో తోట గోవిందరావు, ప్రసాదరావు, ఎం.అనిల్ కుమార్, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు ఆస్పత్రి’ని ప్రైవేటీకరించొద్దు



ఉక్కు ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయు నాయకులు, కార్యకర్తలు



ఉక్కు అధికారులతో సమావేశమైన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి ప్రైవేటీకరణ చర్యలు విరమించుకోవాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ, మిత్రపక్షాల నాయకులు ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఉక్కు ఆస్పత్రిపై గద్దల్లా వాలడానికి అనేక కార్పొరేట్ ఆస్పత్రులు సిద్ధంగా ఉన్నాయన్నారు. దీనిని సందర్శించడానికి వచ్చే ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యాలకు ఎర్ర తివాచీలతో స్వాగతం పలకడాన్ని ఆయన వ్యతిరేకించారు. ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాల్సిన యాజమాన్యం ఆస్పత్రిని ప్రైవేటుకు అప్పగించాలని చూస్తే అంగీకరించేది లేదన్నారు. ఆ ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు వై.టి.దాస్, సీనియర్ నాయకులు ఎన్. రామారావు, మిత్రపక్షాల నాయకులు శ్రీనివాస్, సన్యాసిరావు మాట్లాడుతూ తక్షణం మందులు కొరత తీర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆస్పత్రి ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ సారంగికు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, జీవీ రావు, లోకేష్, దుర్గాప్రసాద్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ అవాస్తవం

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి ప్రైవేటీకరణ అవాస్తవమని యాజమాన్యం తెలిపిందని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు తెలిపారు. శనివారం ఐఎన్‌టీయూసీ బృందం ఆస్పత్రి యాజమాన్యం, హెచ్‌ఆర్ ఉన్నతాధికారులు జి. గాంధీ, కె. సంజీవరావులతో సమావేశమైన వివరాలను తెలియజేశారు. మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవమని, ఆస్పత్రిను ప్రైవేటుకు ఇచ్చే ఆలోచన లేదని తెలిపారు. ఆస్పత్రి ఉక్కు యాజమాన్యం ఆధ్వర్యంలో నడుస్తుందని, అందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆస్పత్రిలో ఇబ్బందులు ఉంటే డాక్టర్ సారంగిని కలవాలని సూచించారన్నారు. రిక్రూట్‌మెంట్‌పై బ్యాన్ ఉన్నందున కొత్త వారిని తీసుకోలేదని, ఉన్నవారితోనే నడుపుతామని తెలిపారు. 17 మంది కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు అవాస్తమని, ల్యాబ్‌లో కేవలం ముగ్గురిని మాత్రమే తీయడం జరిగిందన్నారు. సమావేశంలో నాయకులు బి.టి. జగదీష్, బీఎంకె నాయక్, సుదర్శనం, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో 6 నుంచి రెండో దశ బయోమెట్రిక్



బయోమెట్రిక్ మిషన్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ లోపల విభాగాల్లో రెండో దశ బయోమెట్రిక్ అమలు ఈనెల 6 నుంచి ప్రారంభం కానున్నది. ఈ మేరకు యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం బయోమెట్రిక్ అమలు ప్రారంభించింది. గతంలో ప్లాంట్ బయట ఉన్న విభాగాల్లో బయోమెట్రిక్ అమలు చేశారు. స్టీల్‌ప్లాంట్ లోపలి విభాగాల్లో మొదటి దశగా జనవరి 12 నుంచి 5 విభాగాల్లో బయోమెట్రిక్ అమలు ప్రారంభించారు. మిగిలిన 42 విభాగాల్లో ఈనెల 6 నుంచి ప్రారంభించనున్నారు. ఈనెలాఖరు వరకు బయోమెట్రిక్‌తో పాటు ప్రస్తుతం ఉన్న అటెండెన్స్ పద్ధతి కొనసాగుతుంది. మార్చి 1 నుంచి కేవలం బయోమెట్రిక్ ద్వారా మాత్రమే అటెండెన్స్ గణింపు జరుగుతుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బదిలీ అయిన జెడ్సీకి సత్కారం



సింహాచలంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్‌గా పని చేసి పార్వతీపురం మున్సిపాలిటీకి బదిలీ అయిన పొందూరు సింహాచలంను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం సాయంత్రం సత్కరించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ జోనల్ కమిషనర్‌గా గాజువాక అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఆయనకు పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు సంఘాల సమ్మె నోటీసు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంకు కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటైజేషన్ నిలిపి వేయాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, ఈఎస్ఐ, బోనస్ సీలింగ్ పెంచాలని తదిత డి మాండ్లపై ఈనెల 16న సమ్మె చేయడానికి జాతీయ కార్మిక సంఘాలు, వివిధ ప్రజా సంఘాలు పిలుపు నిచ్చాయి.

ఐక్యంగా పనిచేద్దాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపు

పెదగంట్యాడ: రానున్న ఎన్నికల్లో గాజువాకలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేలా అంతా సమష్టిగా పనిచేద్దామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలని కోరారు. పార్టీ కోసం పని చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కోరారు. గాజువాక నియోజకవర్గంలో ఇప్పటి వరకూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు. గాలి మాటలు వినకుండా 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేలా కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ 20–30 ఏళ్లుగా గాజువాకను పట్టిపీడిస్తున్న సమస్యలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పరిష్కరించారని గుర్తు చేశారు. గాజువాక హౌస్ కమిటీ సమస్య, ఏపీఐఐసీ భూముల సమస్య, కర్ణవాని పాలెం నిర్వాసితుల భూ సమస్యను పరిష్కరించిన ఘనత గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికే దక్కుతుందని కొనియాడారు. నియోజకవర్గ పరిధిలోని 20 వార్డుల్లో రూ.5 కోట్ల నుంచి రూ.20 కోట్లు వరకూ ఖర్చు చేసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారన్నారు. ఈ సమావేశంలో మార్డుపూడి పరదేశి, పల్లా చినతల్లి, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, రాజాన రామారావు, బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు కోమటి శ్రీనివాసరావు, కోమటి రమాదేవి, ధర్మాల శ్రీను, ఇల్లపు ప్రసాద్, గుడివాడ లతీష్, బోగాది సన్యాసిరావు, రాజాన వెంకటరావు, సిరట్ల శ్రీనివాస్ గౌడ్, మహ్మద్ గౌస్, గొందేశి వెంకటరమణారెడ్డి, భూపతిరాజు శ్రీనివాసరాజు, వాడపల్లి రామచంద్రరాజు, పూర్ణానంద శర్మ, యువశ్రీ, కులుకూరి మంగరాజు, మంత్రి శంకరనారాయణ, వెంకటేష్, అండిబోయిన అప్పారావు, అప్పికొండ మహాలక్ష్మీనాయుడు, మద్దాల అప్పారావు, మహేశ్వరరెడ్డి, మామిడి శ్రీను, పల్లా పెంటారావు, వారాది వెంకటరావు, రావాడ శివ, బొడ్డ గోవింద్, మొల్లి చిన్నా, శ్రీను, కొయ్య భారతి, దుర్గమ్మ, మంజుల పాల్గొన్నారు.



పాల్గొన్న అభిమానులు, పార్టీ కార్యకర్తలు

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

గాజువాక: సైన్స్ డే సందర్భంగా స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆలోజింపజేశాయి. జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎ.గౌరీ శంకరరావు ప్రారంభించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సోలార్ ఎనర్జీ, ట్రాఫిక్ నిబంధనలు, రైలు ప్రమాదాల నివారణ, మానవ హృదయం, గుండె పనితీరు, ఇస్రో ప్రయోగాలు, రోడ్డుపై చెత్తను సులువుగా సేకరించే విధానం, ప్లాస్టిక్ నివారణ, గాలి, నీను కలుషితాల నివారణ, నీటిని శుభ్రపరచడం వంటి 80 నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు నిర్వహించిన మెడికల్ క్యాంప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు, వైజాగ్ ఫిలాటిలిక్ సొసైటీ సభ్యులు కె.సి.నాయుడు, వై.విశ్వనాథం, కె.శ్రీనివాస్, పి.గోవిందరాజు, కె.జె.ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో శంకరరావు

ఎన్నికల సిబ్బందితో ఈఆర్వో సమీక్ష

గాజువాక: గాజువాక నియోజకవర్గం ఎన్నికల సిబ్బందితో ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్వో) డి.లక్ష్మారెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలింగ్ బూత్‌లవద్ద ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులున్నా, ఇబ్బందులు తలెత్తుతాయని అనిపించినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ ప్రసాదరావు, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

పరిశీలన, పరిశోధనలపై ఆసక్తి కల్పించాలి

గాజువాక: విద్యార్థుల్లో పరిశీలన, పరిశోధనలపై ఆసక్తిని పెంచే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. స్థానిక ఏవీకే స్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ డే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించినప్పుడే దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు. విద్యార్థులు ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.మానస త్రినాథ్, వైస్ ప్రిన్సిపల్స్ శ్రీదేవి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సమన్వయకర్త చందు

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

అగనంపూడి: అగనంపూడి లయన్స్‌క్లబ్, విజన్ కేర్ సంయుక్తంగా 85వ వార్డు దిబ్బపాలెం రామాలయం ఆవరణలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో అగనంపూడి ఏరియా ఆస్పత్రి వైద్యురాలు కె.కశావతి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ సారథ్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. మనిషి అవయవాల్లో నేత్రలు అతి సున్నితమైన, ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కిడిమి హనుమంతురావు, గుదే సుశీలా గజేంద్రరావు, మస్తాన్‌రెడ్డి, ఎం.జగదీష్, పొన్నగంటి వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ, డాక్టర్ కేజీ నాయుడు, పచ్చారి ప్రభావతి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

1,087వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం; విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం కార్మిక వర్గం చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1087వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

9 నుంచి ‘బీజేపీ పల్లెకు పోదాం’

గాజువాక: బీజేపీని గ్రామస్థాయినుంచి బలోపేతం చేసేందుకు ఈనెల 9నుంచి పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. గాజువాకలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఈ కార్యక్రమంద్వారా ప్రజలకు వివరించాలని కోరారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనా చౌదరి, నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, సోంబాబు, శంకరరావు, సిరసపల్లి నూకరాజు, బొండా ఎల్లాజీరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.